క్లుప్తంగా

పాఠశాలకు ప్రింటర్ వితరణ

కంచిలి: మండలంలోని ఎస్.ఆర్.సి.పురం ప్రాథమిక పాఠశాల విద్యా అవసరాలకు కలర్ ప్రింటర్‌ను వ్యాపారి పూనా శ్రీకాంత్, గుడియా మురళిలు సమకూర్చారు. ప్రధానోపాధ్యాయుడు పొల్లాయి ముకుందరావుకు శనివారం ప్రింటర్‌ను దాతలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, నవోదయ, ఇతర పోటీ పరీక్షలకు సంసిద్ధం చేయడానికి ప్రింటర్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

కంచిలి: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఏర్పడిన భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. కొల్లూరు, అరవసరియాపల్లి రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సందర్భంగా రైతుల నుంచి వినతులను స్వీకరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, తహసీల్దార్ ఎస్.రమేష్ కుమార్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, సర్పంచ్ రేఖాలక్ష్మీనారాయణ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కంచిలి: కొత్తంపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. చిన్నచిన్న లోటుపాట్లను గుర్తించి వాటిని సరిచేయాల్సిందిగా సూచించారు. తనిఖీ సమయంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి ఉన్నారు.

దళిత మహిళకు న్యాయం చేయండి



ఏఎస్పీ శ్రీనివాసరావును కలిసిన దళిత సంఘాల ప్రతినిధులు

కోటబొమ్మాళి: కిష్టుపురం గ్రామంలో ఇటీవల టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చల్ల అప్పలరాజు భార్య దమయంతి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోటబొమ్మాళి, చిన్నసాన సర్పంచ్‌లు కాల్ల సంజీవరావు, బొనే ఎల్లయ్యతో పాటు పలువురు దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు కోటబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ పి.శ్రీనివాసరావు శనివారం కలిసి విన్నవించారు. దాడి కేసులో కొందరిపేర్లను రాజకీయ ఒత్తిడితో తప్పించారని.. తగు దర్యాప్తు జరిపి కేసుతో ప్రమేయమున్న వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఏఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కవిటి: స్థానిక చింతామణి అమ్మవారి రోడ్డులో బి.పాపయ్య రెడ్డి ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న వెంకటేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు విరాళాన్ని ప్రకటించింది. శనివారం సాయంత్రం ఈ మేరకు ఆలయ నిర్మాణాన్ని పరిశీలించిన ట్రస్టు అధ్యక్షుడు రెయ్యి కోదండకృష్ణ తనవంతుగా రూ. పది వేల సాయాన్ని పాపయ్యరెడ్డికి అందించారు. పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

టెక్కలి: పాతనౌపడ గ్రామంలో గల తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బిగ్ హెల్ప్ సంస్థ ద్వారా శనివారం దుప్పట్లు, కాస్మోటిక్స్ వస్తువులను ఉచితంగా అందజేశారు. సంస్థ డైరెక్టర్ ఆర్.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు రూ.15 వేల విలువైన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎన్.కృష్ణారావు, ఉపాధ్యాయులు బి.విద్యావతి, బి.లత, బి.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, డిల్లేశ్వరి ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు

వజ్రపుకొత్తూరు: రాష్ట్ర స్థాయి అండర్ -17 అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం పయనమయ్యారు. శ్రీకాకుళంలో ఆదివారం నుంచి రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాఠశాల నుంచి గిన్ని లింగప్రధాన్, కీలు ధనుంజయలు ఎంపిక కావడంతో వారిని ప్రధానోపాధ్యాయులు కె.హరిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.నాగరాజు, ఉపాధ్యాయులు జి.లక్ష్మణరావు, సీహెచ్ ఉమారావు, సత్యరాజు సీతమ్మ, ఉమామహేశ్వరి, రసీద్, రాజశేఖర్ ఉన్నారు.

ఈదుపురం విద్యార్థులకు..

ఇచ్ఛాపురం రూరల్: ఈ నెల ఐదు నుంచి ఏడు తేదీ వరకు నరసరావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఈదుపురం కంద్రావార్డు ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం బి.రామారావు తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో విద్యార్థులు పరమ బెహరా (అండర్-17), తుంబనాథ్ బెహరా(అండర్-14), సోమేశ్ బెహరా(అండర్-14)లతో పాటు వ్యాయామోపాధ్యాయుడు రఘుమోహన్ రావుల కృషిని అభినందించారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

సోంపేట: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో ప్రమీల అన్నారు. బెంకిలి, జింకిభద్ర పంచాయతీల్లో వేతనదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల పటాలు వేసి చేపట్టిన పనులు, సహజన వనరులు గురించి వివరించారు. టీఏలు శ్రీనివాసరావు, త్రినాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు జుత్తుకుమారి, తామాడ జానకీ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు.. 'స్మార్ట్' గుబులు!

- పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- మొదటి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్ కేటగిరీలకు అమరిక
- ఉపాధి కోల్పోనున్న మీటర్ రీడర్లు



టెక్కలిలో ఓ దుకాణానికి ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

టెక్కలి: విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల గుబులు వెంటాడుతోంది. అలాగే విద్యుత్ మీటర్ రీడింగ్ నమోదు వ్యవస్థపై ఆధారపడుతున్న వారికి కూటమి ప్రభుత్వం స్మార్ట్ రూపంలో మరో షాక్ ఇవ్వనుంది. ప్రస్తుతం వినియోగిస్తున్న ఐఆర్‌డీ మీటర్ల స్థానంలో దశల వారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. మొదటి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్ కేటగిరీలో ఉన్న వాటికి వీటిని అమరుస్తున్నారు. భవిష్యత్‌లో గృహాలు, వ్యవసాయం, ఇతర వాటికి అమర్చనున్నారు. ఈ వ్యవస్థతో దశాబ్దాలుగా మీటర్ రీడింగ్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న మీటర్ రీడర్లు నడిరోడ్డున పడనున్నారు.

టెక్కలిలో 96,940 విద్యుత్ కనెక్షన్లు

టెక్కలి నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 96,940 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో యాప్, ఆన్‌లైన్ ద్వారా కొన్ని కనెక్షన్లకు సంబంధించి బిల్లులు చెల్లిస్తుండగా మరికొన్ని వాటిపై సుమా 36 మంది మీటర్ రీడర్లు ప్రతీ నెలా ఇంటింటా తిరుగుతూ రీడింగ్ నమోదు చేస్తున్నారు.

ముందగానే రీచార్జ్ చేసుకోవాలి

స్మార్ట్ మీటర్ల విధానంలో భాగంగా సెల్‌ఫోన్ మాదిరిగా ముందుగానే రీచార్జ్ చేసుకోవాలి. క్యూ ఆర్ కోడ్‌తో మీటర్లు ఏర్పాటు చేయడంతో ఆ కోడ్‌ను వినియోగించి రీచార్జ్ చేసుకోవాలి. ఏదైనా సాంకేతిక ఇబ్బందులతో రీచార్జ్ చేసుకోకపోతే కరెంట్ సరఫరా నిలిచిపోతుంది. మీటర్ రీడర్ల అవసరం లేకుండా ఆటోమేటిక్‌గా రీడింగ్ నమోదు అవుతుంది.

మీటర్ రీడర్ల ఉపాధికి గండం..

ప్రస్తుతం ఐఆర్‌డీ మీటర్ల రీడింగ్ కోసం మీటర్ రీడర్లకు ఒక్కో బిల్లుపై సుమారు రూ.3.64 పైసలు చెల్లిస్తున్నారు. స్మార్ట్ మీటర్ల వినియోగంలోకి వస్తే వారి అవసరం ఉండదు. దీంతో మీటర్ రీడర్లంతా రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై మీటర్ రీడర్లు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నారు.

నియోజకవర్గంలో వివిధ కేటగిరీల్లో విద్యుత్ కనెక్షన్లు

టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం వివిధ కేటగిరీల్లో విద్యుత్ కనెక్షన్లు పరిశీలిస్తే..

గృహాలు	84,814
కమర్షియల్	5,717
పరిశ్రమలు	614
ప్రభుత్వ కార్యాలయాలు	3,897
వ్యవసాయం	1896

ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు మునుపు మా మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి. ఎన్నో దశాబ్దాలుగా ఇదే వ్యవస్థపై ఆధారపడి పనిచేస్తున్నాం. మా సేవలను దృష్టిలో ఉంచుకుని తమను ఆదుకోవాలి.

-పి.శ్రీనివాసరావు, మీటర్ రీడర్ల అసోషియేషన్ అధ్యక్షుడు, టెక్కలి

దశాబ్దాలుగా ఇదే వృత్తి..



విద్యుత్ వ్యవస్థలో మీటర్ల రీడింగ్‌పై ఆధారపడి దశాబ్దాలుగా ఉపాధి పొందుతున్నాం. ఇప్పుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో మమ్మల్ని పక్కన పెట్టే ఆలోచన చేస్తున్నారు. ఇటువంటి నిర్ణయాలు తీసుకునే ముందు మాలాంటి వారిపై దృష్టి సారించాలి.

-వి.ప్రసాదరావు, మీటర్ రీడర్ల అసోషియేషన్ ఉపాధ్యక్షుడు, టెక్కలి

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం



ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్ కేటగిరీల్లో ఉన్న వాటికి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఆ తరువాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గృహాలకు, వ్యవసాయ కనెక్షన్లు, ఇతర వాటికి అమర్చే ప్రక్రియ చేపడుతున్నాం.

-జి.శంకరరావు, విద్యుత్ శాఖ డీఈఈ, టెక్కలి డివిజన్

అధైర్య పడకండి అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్
- టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వ్యక్తికి పరామర్శ



మన్మథరావును పరామర్శిస్తున్న కృష్ణదాస్, అప్పలరాజు తదితరులు

కాశీబుగ్గ: వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎవరూ అధైర్య పడవద్దని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అందరం కలిసి టీడీపీ నాయకుల అరాచకాలను ఎదుర్కొందామన్నారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్లో ఇటీవల టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి రోటరీనగర్‌లో ఉంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రముఖ కాంట్రాక్టర్, టీడీపీ నాయకుల దాడికి గురైన మొదలవలస మన్మథరావు ఇంటికి శనివారం ఉదయం వెళ్లి పరామర్శించారు. శాంతి భద్రతలకు నిలయమైన పోలీస్‌స్టేషన్లో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. అధైర్య పడవద్దని ఇటువంటి సంఘటనలను కలిసికట్టుగా ఎదుర్కొందామని.. తామంతా మీ వెంట ఉన్నామని అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సంఘటనను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కృష్ణదాస్‌కు తెలియజేశారు. వారికి న్యాయం జరగకుంటే తాము చేసిన న్యాయపోరాటాన్ని వివరించారు. న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్, పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎంపీపీ డొక్కరి దానయ్య, పీఏసీఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు, నాయకులు పానిల శ్రీనివాసరావు, ఉంగ సాయిక్రిష్ణ, బోర క్రిష్టారావు, పిచ్చుకల అజయ్, బెల్లాల శ్రీనివాసరావు, సనపల సింహాచలం, బమ్మిడి సంతోష్, బల్ల శ్రీనివాస్, దున్న సత్యం, పి.వి.సతీష్ ఉన్నారు..

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఆదిత్య విద్యార్థి



సాగర్‌ను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

టెక్కలి: పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లో ఈ నెల ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ మొదటి సంవత్సరం విద్యార్థి ఆరంగి సాగర్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం విద్యార్థిని సాగర్‌ను అభినందించారు. జేఎన్‌టీయూ జీవీ విజయనగరం యూనివర్సిటీ ఇటీవల నిర్వహించిన అంతర్ వర్సిటీ పోటీల్లో ప్రతిభ కనబర్చడం ద్వారా సాగర్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌ఓడీ వి.అశోక్‌కుమార్, పీడీలు ఎస్.లక్ష్మణమూర్తి, టి.మురళీమోహన్, జె.తేజేశ్వరి ఉన్నారు.

నాయకుల పరామర్శ

కవిటి: మండలంలోని లండారిపుట్టుగ పంచాయతీ శావసానపుట్టుగకు చెందిన మామిడి శేషగిరి కిడ్నీ వ్యాధితో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు వారి కుటుంబాన్ని శనివారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. తనవంతుగా కొంత ఆర్థిక సాయాన్ని అందించారు. పరామర్శలో నర్తు చంద్రయ్య, దర్శయ్య, తులసీదాస్, హరికృష్ణ ఉన్నారు.

టెక్కలి: టెక్కలి ఆదిఆంధ్రావీధికి చెందిన ఎర్ర భారతమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ శనివారం పరామర్శించారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు సత్తారు సత్యం, టి.కిరణ్ ఉన్నారు.

తొమ్మిదిసార్లు గెలిచినా అభివృద్ధి శూన్యం

- ఎమ్మెల్సీ రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: తెలుగుదేశం పార్టీ తరపున అభ్యర్థులను తొమ్మిదిసార్లు గెలిపించిన ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని ఆ పార్టీ ఎమ్మెల్యేలు అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాల్సింది పోయి తొక్కేశారని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఎద్దేవా చేశారు. శనివారం ఆయన స్థానిక ఎంపీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉచిత గ్యాస్ పంపిణీకి ఈదుపురం వచ్చిన సీఎం చంద్రబాబు తొమ్మిదిసార్లు టీడీపీని గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలేమంటూ ఉపన్యాసించారని, అధికారంలో ఉండి నియోజకవర్గానికి శాశ్వతమైన ఒక్క పని చేసినట్లు చెప్పాలని డిమాండ్ చేశారు. తిత్లీ తుఫాన్ సమయంలో 11 గ్రోయిన్లు పూర్తిగా కొట్టుకుపోవడంతో అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ వాటిని గాలికి వదిలేశారని, ఇప్పుడు వాటిని పునరుద్ధిస్తామని చెప్పడం రైతులను మరోమారు మోసగించడమేనని విమర్శించారు. ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీ వ్యాధుల నుంచి ప్రజల్ని రక్షించేందుకు తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో కోట్ల రూపాయలు వెచ్చించి పలాసలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రూ.700 కోట్లతో సుజలధార ప్రాజెక్టులో ఇంటింటికీ కుళాయి ద్వారా వంశధార నీటిని అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు మాట నిలుపుకోలేదని, ఈ ఎన్నికల్లో కూడా మరోమారు ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని మోసగించేందుకు 'గ్యాస్' మాటలు చెబుతూ, అర్హత ఉన్న 54 లక్షల మందికి అన్యాయం చేశారని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం వైపు దృష్టి సారించి ప్రజలకు మంచి పాలన అందించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, సర్పంచ్‌లు కారంగి త్రినాథ్‌రెడ్డి, పిట్ట మామయ్యరెడ్డి, సంతోష్ మండలా, సాడి గురుమూర్తి, రాంపత్ని చిట్టిబాబు, రంగాల కృష్ణారెడ్డి, చిరంజీవి, వెంకటరావు, భీమారావు పాల్గొన్నారు.

పిల్లలకు దుస్తులు అందజేత

కాశీబుగ్గ: కాశీబుగ్గ బాల సదన్‌లోని 35 మంది అనాథ పిల్లలకు నందిగాం మండలం పోతులూరు గ్రామానికి చెందిన భారత సైనికుడు గేదెల గిరిబాబు దుస్తులను శనివారం అందజేశారు. జవాన్ కుటుంబ సభ్యులు, పవనపుత్ర సవా సంస్థ సభ్యులు, సైనిక కుటుంబాలు పాల్గొన్నాయి.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

కాశీబుగ్గ: పలాస మండల కేంద్రం నుంచి ఒడిశా సరిహద్దును కలిపే గొప్పిలి రోడ్డులో కెంటికోట గ్రామం వద్ద రోడ్డు మరమ్మతు పనులకు ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం భూమిపూజ చేశారు. ఈ పనుల కోసం రూ.పది లక్షలు మంజూరైంది.

బాలల హక్కులపై అవగాహన

కాశీబుగ్గ: బాలల హక్కులపై పలాస రైల్వేస్టేషన్ వద్ద శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది చైల్డ్‌హెల్ప్ డెస్క్ వారితో సంయుక్తంగా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. బాల బాలికలు ఆపదలో ఉన్నప్పుడు 1098 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఆర్పీఎఫ్ ఏఎస్ఐ బిస్వాల్, కానిస్టేబుల్ లత ఉన్నారు.

కేజీబీవీ సందర్శన



టాయిలెట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో తిరుమలరావు

కంచిలి: జాడుపూడి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఎంపీడీవో వి.తిరుమలరావు ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబులతో కలిసి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాబోధనతోపాటు ఉపాధ్యాయుల హాజరు, అపార్, యూడైస్‌లపై సమీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్‌లను పరిశీలించారు. ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పనిచేయాలని, టాయిలెట్స్ నిర్వహణ, శానిటేషన్ తీరు సరిగ్గా లేదని, మరింత శ్రద్ధకనబరచాలని సూచించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..



అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తరగతి గదుల వద్ద దట్టంగా పొదలు అల్లుకుపోయాయి. దీంతో తరగతి గదిలోకి విషసర్పాలు చొరబడుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పొదలను తొలగించాలని కోరుతున్నారు.

– సంతబొమ్మాళి

బోరు చెంతనే మురుగు!



టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి సోగ్గాడిపేట వీధిలో బోరు చుట్టూ మురుగు చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికంగా ఉన్న వారంతా ఈ బోరు నీటిని వినియోగిస్తుంటారు. అయితే బోరు చుట్టూ ఉన్న కాలువల్లో దట్టంగా మురుగు నీటి నిల్వలు పేరుకుపోయి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. మరో వైపు దుర్గంధంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ యంత్రాంగం స్పందించి మురుగు నీటిని తొలగించాలని కోరుతున్నారు.

–టెక్కలి

కార్యాలయాలకు రక్షణ కరువు..



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కార్యాలయాలకు భద్రత లేకుండా పోయింది. పగిలిన అద్దాలతో కనిపిస్తున్న తులసిగాం గ్రామ సచివాలయం ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. కొంత మంది ఈ నిర్మాణాలను ఓర్చుకోలేక ప్రభుత్వ కార్యాలయం అన్న విసయాన్ని మరచిపోయి అద్దాలను ధ్వంసం చేసి పైశాచికానందం పొందుతున్నారని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన కార్యాలయాలకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

-ఇచ్ఛాపురం రూరల్

కుక్కలతో భయం..



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డుల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ జనాన్ని భయపెడుతున్నాయి. ఎక్కడ చూసినా శునకాలు విచ్చలవిడిగా తిరుగుతుండడంతో జనం రోడ్డుపైకి రావడానికి భయపడుతున్నారు. ప్రధానంగా కేటీరోడ్డు ప్రాంతంలో వీటి బెడద మరీ ఎక్కువగా ఉంది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ఇంటికి వచ్చేవరకూ తల్లిదండ్రులు ఆందోళనతో ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు దృష్టిసారించి కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

–కాశీబుగ్గ

ఆలయ అభివృద్ధి పనులు పరిశీలన

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ తీరం వద్ద ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు దాతల సహకారంతో జరుగుతున్నాయని కమిటీ అధ్యక్షుడు మద్దు నాగేశ్వరరావు తెలిపారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. సుమారు 304 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం ఉద్దాన, తీర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండటంతో అంచంచెలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రస్తుతం రూ.15 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి ఈ ప్రాంతానికి అధ్యాత్మిక శోభ తీసుకు వస్తామన్నారు. ఆలయ ప్రాంగాణంలో ఇటీవల అభయ గణపతి, వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలను నిర్మించామన్నారు. పనుల పరిశీలనలో కమిటీ కార్యదర్శి చెల్లూరి కృష్ణారావు, ఉపాధ్యక్షులు తామాడ సరస్వతి, బత్తిని తరిణయ్య ఉన్నారు.

నందన్న ఉత్సవాల నిలిపివేత

- తిరగబడిన చినంచల గ్రామస్తులు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న చినంచల గ్రామస్తులు

కాశీబుగ్గ: పలాస మండలం చినంచల గ్రామంలో శనివారం రాత్రి నందన్న ఉత్సవాల అడ్డగింత వివాదంగా మారింది. గౌరీదేవి నందన్న ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను నిబంధనల పేరిట కాశీబుగ్గ పోలీసులు నిలిపివేశారు. ఎలాంటి గొడవలు లేకుండా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు రాజకీయాలు రంగు పులుమి నిలిపివేయడం దారుణమని వారంతా ఎదురుతిరిగారు. మహిళలు పోలీసులను చుట్టుముట్టి నిలదీశారు. అనంతరం గ్రామస్తులంతా ఏకమై ప్రశాంతంగా ఉన్న గ్రామంలో పోలీసుల రూపంలో గొడవలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. శనివారం రాత్రి 11.30 సమయంలో ఈ గొడవ జరిగింది. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ బీడీ రావు స్పాన్సర్ చేయడం వల్ల ఉత్సవాలకు రాజకీయ రంగు పులిమారని స్థానికులు తెలిపారు.

సంక్షిప్తంగా...

ఎర్రన్నకు ఘన నివాళి

కోటబొమ్మాళి: కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 12వ వర్ధంతి కార్యక్రమాన్ని నిమ్మాడ గ్రామంలో శనివారం నిర్వహించారు. ఎర్రన్న ఘాట్‌లో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, బెందాళం అశోక్, గొండు శంకర్, మామిడి గోవిందరావు నివాళులర్పించారు.

భూ రీసర్వేతో సమస్యలకు చెక్

ఇచ్ఛాపురం రూరల్: గతంలో భూసర్వే చేసిన ప్రాంతాల్లో మరోమారు భూ రీసర్వే చేయడం మూలంగా సమస్యలకు చెక్ పడనుందని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. టి.బరంపురంలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్.కృష్ణ ఉన్నారు.

నేడు రైల్వే గేటు మూసివేత

టెక్కలి: టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రైల్వే గేటును ఆదివారం మూసివేస్తున్నట్లు పీడబ్ల్యూఐ ఇంజినీర్ వై.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైల్వే గేటు మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో సాయంత్రం ఆరు నుంచి సోమవారం ఉదయం ఆరు గంటల వరకు గేటును పూర్తిగా మూసివేస్తున్నామని పేర్కొన్నారు. వాహనచోదకులంతా ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు సాగించి సహకరించాలని కోరారు.

అమరజీవికి ప్రవాసాంధ్రులు నివాళి



అమరజీవి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బిలాయి తెలుగు సమాజ్ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం చిరస్మరణీయమని బిలాయి తెలుగు సమాజ్ అధ్యక్షుడు బర్రి జోగారావు కొనియాడారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాయిలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద బిలాయి తెలుగు సమాజ్ ఆధ్వర్యంలో శనివారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. తెలుగు జాతి ఖ్యాతి కోసం శ్రీరాములు చేసిన త్యాగానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి తెలుగువాడు రుణపడి ఉండాలని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ అదర్శంగా తీసుకోవాలని కోరారు. బిలాయి తెలుగు సమాజ్‌తో పాటు పలు సంఘాల ప్రతినిధులు మొరిపల్లి బాబూరావు, భాస్కరరావు, పిచ్చుక మురహరి, కోనేరు యర్రన్న, బైనపల్లి తులసీరావు, లండ రుద్రమూర్తి, డి.కామరాజు, జోలింగ కూర్మారావు, కె.రాజేంద్ర, సుబ్రహ్మణ్యం, ఎస్.రామారావు, అర్జల వాసుదేవ్ ఉన్నారు.